
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
నారాయణపేట
జిల్లా వార్తలు
శుక్రవారం 31 అక్టోబరు 2025



అటకెక్కిన శేషాద్రి పవర్‌ప్లాంట్

- ఇప్పటివరకు ప్రారంభం కాని పరిశ్రమ నిర్మాణం
- భూములు ఇచ్చిన రైతులకు రాని ఉద్యోగాలు
- కోట్ల రూపాయలు పలుకుతున్న భూముల ధరలు
- సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రైతులు

6

బోర్లు వేశారు ... మోటార్లు మరిచారు

- నిధులు లేక నిలిచిన విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు
- ప్రభుత్వం మారడంతో అటకెక్కిన సీఎం గిరి వికాసం
- 11,559 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చేలా పథకం
- దాని స్థానంలో ఇందిరా సౌరగిరి జలవికాసం అమలు



నాగర్‌కర్నూల్ జిల్లా మాచారంలో ఇందిరా సౌరగిరి జల వికాసం ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

మహబూబ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత ప్రభుత్వం గిరిజన రైతులకు ఆర్థిక స్వావలంబన తీసుకురావడం, సాగుకు యోగ్యంకాని భూములను అభివృద్ధి చేయడం కోసం అప్పటికే అమలులో ఉన్న ఇందిర జలప్రభ పథకం స్థానంలో సీఎం గిరి వికాసం పథకాన్ని చేపట్టింది. దీని ద్వారా వృథాగా ఉన్న గిరిజన రైతుల భూములను సాగుకు అనువుగా మార్చడం, బోర్లు వేసి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లు బిగించాల్సి ఉంది. 2017లో ఈ పథకాన్ని ప్రారంభించగా, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే ట్రైకార్, గ్రామీణాభివృద్ధి శాఖల నేతృత్వంలో పనులు చేపట్టారు. రాష్ట్రంలో 11,599 మంది గిరిజన రైతులకు చెందిన 33,667 ఎకరాల భూములను ఈ పథకం కింద సాగు భూములుగా మార్చాల్సి ఉంది. అయితే అన్ని జిల్లాల్లో గ్రామీణా భివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చాలా వరకు బోర్లు వేశారు. దీనికింద రూ. 52.68 కోట్లు ఖర్చు చేయాలని భావించినప్పటికీ గత ప్రభుత్వం ఆరంభంలో చూపించిన శ్రద్ధ తర్వాత చూపలేదు. దీంతో బోర్లు వేసినప్పటికీ తర్వాత చేయాల్సిన పనులను చేపట్టలేదు. కొందరు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బోర్లు వేయడంలో తీవ్రమైన అవినీతికి కూడా పాల్పడినట్లు గతం నుంచే ఆరోపణలు ఉన్నాయి. బోర్లు వేయకుండానే వేసినట్లుగా రికార్డులను సృష్టించి బిల్లులు కాజేసినట్లు విమర్శలున్నాయి.

అదే సమయం లో ప్రభుత్వం కూడా పట్టించుకోక పోవడంతో ఆ పథకం కింద బోర్లు వేసుకున్న వారు విద్యుత్ కనెక్షన్, మోటార్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే పోడు భూములకు పట్టాలు ఇచ్చిన సమయంలోనూ గత ప్రభుత్వం సుమారు మరో 37,987 మంది గిరిజన రైతులకు ఈ పథకం కిందనే లబ్ధి చేకూరుస్తామని ప్రకటించింది. అది కూడా ఆచరణ సాధ్యం కాలేదు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం మారడంతో సీఎం గిరి వికాసం పథకం పూర్తిగా అటకెక్కినట్లయ్యింది.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి

వాస్తవానికి ఈ పథకం ప్రారంభించినప్పుడు రూ. 52.68 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని అంచనా వేసుకున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ. 1.50 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంది.

ఒకవేళ కొంత మేర అంచనాలు పెరిగినా, పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తే, తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి జరిగేది. కానీ ఆ దిశగా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

కానీ చేతివాటం మాత్రం ప్రదర్శించారు. ఉదాహరణకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం గిరి వికాసం పథకం కింద 1,136 బోర్లను వేయించగా, 79 బోర్లు ఫెయిల్ అయ్యాయి. 1,057 బోర్లు విజయవంతమయ్యాయి. వీటన్నింటికీ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసి ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లను బిగించాల్సి

(మిగతా 6లో..)

స్పందన లేదు



గత ప్రభుత్వం లో సీఎం గిరి వికాసం పథకం కింద నా పొలంలో బోరు వేశారు. విద్యుత్ క నెక్షన్ ఇచ్చి మోటా ర్ కూడా బిగిస్తామ ని చెప్పారు. కానీ, ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వలేదు. మోటార్ బిగించలేదు. ఈ పథకం అమలు కోసం ఎమ్మెల్యే లెటర్ తీసుకొని హై దరాబాద్ ఆఫీసుకు వెళ్లి కలిశాను. కానీ, నిధులు లేవు. వచ్చినప్పుడు ఇస్తామని చెప్పారు. నాతో పాటు మరికొందరు రైతులు కూడా విద్యుత్ కనెక్షన్, మోటార్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి మోటార్లు ఇవ్వాలి.

- రవినాయక్, గిరిజన రైతు, ముత్యాల తండా, జోగుళాంబ గద్వాల జిల్లా

బోరు మాత్రమే వేశారు



నాకు గతంలో సీ ఎం గిరి వికాసం పథకం కింద బోరు వేశారు. విద్యుత్ కనెక్షన్ కానీ, మో టార్ కానీ ఇవ్వలే దు. మోటార్ ఏర్పా టు చేస్తే కూరగాయలు పండించి, లబ్ధి పొందాలని అనుకుంటున్నాను. కానీ ఇప్పటికే మూడు సంవత్సరాలవుతోంది. ఇప్పటి వరకు ఎవరూ స్పందించడం లేదు. ప్రభుత్వం నుంచి త్వరగా స్పందన వస్తే పని అవుతుంది. లేకపోతే కొత్త పథకంలోనైనా మమ్మల్ని చేర్చాలి.

- రవినాయక్, బోయిన్‌పల్లి తండా, నారాయణపేట జిల్లా



నారాయణపేట మండలం సింగారంలో నేలకొరిగిన వరి పంట



మిడ్జిల్ సమీపంలో దెబ్బతిన్న పైరును చూపుతున్న రైతు అంజనేయులు

'మొంథా' పంజా

- భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం
- నేలకొరిగిన వరి పైర్లు, నల్లబారిన పత్తి పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



నారాయణపేట మండలం జాజాపూర్‌లో వర్షానికి తడిసి నల్లబారిన పత్తి పంట

పాలమూరు/నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా రైతులను నిండా ముంచింది. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతులు 2,19,610 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. భారీ వర్షాలతో సుమారు 1000 ఎకరాల వరకు వరి పైర్లు దెబ్బతిన్నాయని రైతులు చెప్తున్నారు. ప్రాథమిక అంచనా మేరకు దాదాపు 750 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఇదే విషయాన్ని కమిషనరేట్‌కు నివేదించి, క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తే ఎంత నష్టం జరిగిందో స్పష్టంగా తెలుస్తుంది. కమిషనరేట్ నుంచి వచ్చే ప్రొఫార్మా ప్రకారం సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. 33 శాతం దెబ్బతింటేనే పంట నష్టపోయినట్లు ప్రభుత్వం లెక్కలోకి తీసుకుంటుంది. వరి పైర్లు కోతకు వచ్చిన దశలో భారీ వర్షాలు కురవడంతో కోత యంత్రాలు పొలాల్లోకి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రైతులు 1,63,082 ఎకరాల్లో పత్తి, 1,77,658 ఎకరాల్లో వరి సాగు చేశారు. తుపాను ప్రభావంతో పత్తి పంటలో పూత, కాయ రాలిపోయింది. అక్కడక్కడ పంట చేతికి వస్తున్న సమయంలో పడిన వర్షాలకు పత్తి నల్లబారిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మాగనూర్, కృష్ణ మండలాల్లో పత్తి ఏరేందుకు కూలీల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కర్ణాటక నుంచి కూలీలను రప్పించుకొని పత్తి ఏరుతున్నా, వాతావరణం కలిసి రాలేదు. ప్రతీ రోజు వర్షాలు కురుస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఎడతెగని వర్షాలతో పత్తిలో తేమ శాతం అధికమై మద్దతు ధర లభించడం కష్టతరమైందని రైతులు చెప్తున్నారు. ధాన్యం చేతికి వచ్చే సమయంలో తుపాను ప్రభావంతో పంట నేలకొరిగిపోతోంది. నారాయణపేట, మరికల్, మాగనూర్, కృష్ణ కొత్తపల్లి తదితర మండలాల్లో వరి పంట నేలకొరిగింది. నారాయణపేట మండలంలోని సింగారంలో 450 ఎకరాల వరకు వరి సాగు చేయగా, 20 ఎకరాల వరకు పంటకు నష్టం వాటిల్లిందని స్థానిక రైతులు తెలిపారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

- విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం గుంతలు
- నీటితో నిండిన గుంతలో జారిపడి బాలుడి మృతి



మృతి చెందిన సిద్ధార్థ



బాలుడి మృతికి కారణమైన గుంత

మిడ్జిల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ కుటుంబాన్ని విషాదంలో ముంచింది. విద్యుత్ స్తంభం ఏర్పాటు కోసం తవ్విన గుంతలో పడి ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లిలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి.. విద్యుత్ ఉపకేంద్రానికి మెయిన్‌లైన్ కోసం విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గ్రామంలోని రోడ్డు వెంట గుంతలు తవ్వారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాటిలో నీరు నిండింది. గ్రామానికి చెందిన పిట్టల రామకృష్ణ, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు సిద్ధార్థ (3) ఇంటి ముందు ఆడుకుంటూ ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు కోసం తవ్విన గుంతలో జారి పడిపోయాడు. కొంత సేపటి తర్వాత బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. చివరకు గుంతలో పరిశీలించగా, బాలుడు కనిపించాడు. వెంటనే బయటకు తీసి మిడ్జిల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే బాలుడు ప్రాణాలు కోల్పోయాడని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాటన్ మిల్లు వద్ద పత్తి రైతుల ఆందోళన

- రెండు కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- రెండు గంటల పాటు రాస్తారోకో
- కలెక్టర్ రావాలని పట్టుబట్టిన రైతులు

6

రండి.. సాంస్కృతిక పోటీల్లో పాల్గొందాం

- ఐదు అంశాల్లో పోటీలు
- వచ్చేనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలి

7

ఆస్తిపన్ను వసూలుపై దృష్టి సారించాలి

- మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వందశాతం వసూలుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాదితో పాటు పెండింగ్ పన్నుల వసూలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలు పేరుకుపోతున్నాయని, పాత వాటికి నోటీసులు జారీ చేయాలని సూచించారు.

పన్నులు వసూలైతేనే ప్రజలకు మెరుగైన సేవలను అందించగలుగుతామని చెప్పారు. ప్రాంతాల వారీ జాబితాను వెంట ఉంచుకొని నూరు శాతం పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- పీఎం ధన్‌ధాన్య కృషి యోజనపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయా శాఖల పురోగతికి సంబంధించిన వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. అలాగే వచ్చే ఐదేళ్లకు సంబంధించిన ముందస్తు సమగ్ర ప్రణాళికను తయారు చేయాలన్నారు. పీఎం ధన్‌ధాన్య కృషి యోజన అమలుకు వార్షిక ప్రణాళికను రూపొందించడంపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించడం, రైతుల ఆదాయం పెంచడం, గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. పథకం అమలుకు అధికారులు తమ శాఖలకు సంబంధించిన అన్ని పారామీటర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. బేస్‌లైన్ సర్వేలో పూర్తి వివరాలను నమోదు చేసి, వార్షిక ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మ త్స్య, హార్టికల్చర్ శాఖల అధికారులు పూర్తి వివరాలతో సమగ్ర ప్రణాళికతో పాటు, డాక్యుమెంటరీ, పవర్ పాయింగ్ ప్రజెంటేషన్‌లను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారి సాయిబాబా, డీఆర్‌డీవో మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, నాబార్డ్ జిల్లా మేనేజర్ షణ్ముఖాచారి, ఎల్‌డీఎం విజయ్ కుమార్, నీటి పారుదల శాఖ ఈఈ బ్రహ్మానందరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను పట్ల డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు, మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది తమ కార్యస్థానాల్లో ఉండాలని ఆదేశించారు. ఎవరూ సెలవులపై వెళ్లకూడదని సూచించారు. వర్షాలు, సహాయక చర్యలు తదితరాలకు సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08542-241165కు అందించాలన్నారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రాణ, పశు, ఆస్తి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పనులు పూర్తి చేయాలి

- సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి
- జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శంకర్
- ఊట్కూరు, కొల్లూరు గ్రామాల్లో పర్యటన



ఊట్కూర్‌లో ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ, ఎంపీడీవో


ఊట్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్ లబ్ధిదారులకు సూచించారు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల కేంద్రంతో పాటు, కొల్లూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫొటో కాప్చర్ పూర్తయ్యిందా? మొదటి బిల్లు వచ్చిందా? తదితర వివరాలను ఆరా తీశారు. పనులు ఎందుకు వేగవంతం కావడంలేదని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా 6,430 ఇళ్లు మంజూరు కాగా, అందులో 4,594 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటి వరకు 2,996 మంది లబ్ధిదారులు పునాదుల పనులు పూర్తి చేశారని, 443 ఇండ్లు స్లాబ్ లెవల్‌లో ఉన్నాయని చెప్పారు. లబ్ధిదారులందరికీ బిల్లులు వస్తాయని, సకాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేస్తూ, సకాలంలో బిల్లు వచ్చేలా చూడాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 223.00
స్కిన్ లెస్	: 243.00

కొనసాగుతున్న భక్తుల రద్దీ

- గోవింద నామస్మరణతో పులకిస్తున్న గిరులు



కురుమూర్తి జాతరలో భక్తుల రద్దీ

7

కులపత్రాలు ఇవ్వకపోతే తిరుగుబాటు

- మదాసి, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్



జిల్లా కమిటీ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్

పాలమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మదాసి, మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని తెలంగాణ మదాసి, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో మహబూబ్‌నగర్ అధ్యక్షుడు బత్తుల మొగులయ్య, నాగర్‌కర్నూల్ అధ్యక్షుడు ఊరే నాగమల్లయ్య, వనపర్తి అధ్యక్షుడు సంకెళ్ల విష్ణు, గద్వాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నారాయణపేట అధ్యక్షుడు సీహెచ్ వెంకటన్నలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మదాసి, మదారి కురువలకు కుల సర్టిఫికెట్లు జారీ చేసేలా ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం కురుమల అభ్యున్నతి కోసం పోరాటం చేయాలన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పోరాటం ఉధృతం చేయాలన్నారు. జీవో 1268అమలు చేయటంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటంలో అలసత్వం వీడాలన్నారు. నవంబరు, డిసెంబరు నెలలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

చికెన్, మటన్, చేపల వ్యర్థాల తొలగింపునకు వేలం

- రూ. 34 లక్షలకు దక్కించుకున్న కాంట్రాక్టర్



వేలం నిర్వహిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

జడ్చర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలో చికెన్, మటన్, చేపల వ్యర్థాలను తొలగించేందుకు గురువారం వేలం నిర్వహించారు. చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాదిసారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. సరైన ఏజెన్సీ ధ్రువపత్రాలు సమర్పించని లక్ష్మణ్, గత నెలలో నిర్వహించిన వేలం దక్కించుకుని సకాలంలో రుసుము చెల్లించకపోవడంతో దరఖాస్తులను పరిగణలోకి తీసుకోలేదు. వేలం రూ.20.50లక్షల నుంచి ప్రారంభించగా, శ్రీకాంత్‌రెడ్డి, తసీన్, రాజు మొదటగా రూ.500, రూ.వెయ్యి మాత్రమే పెంచుకుంటూ పోయారు. అత్యధికంగా రూ.34.29లక్షలకు శ్రీకాంత్‌రెడ్డి దక్కించుకున్నారు. వేలం సందర్భంగా మునిసిపాలిటీ కార్యాలయం బయట ఓ వర్గానికి చెందిన వారు, వేలంలో పాల్గొనేందుకు వచ్చిన ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురిచేశారు. వేలంలో పాల్గొనవద్దంటూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న వారంతా చూసి హడలిపోయారు. కౌన్సిలర్లు చైతన్యచౌహన్, బుక్కమహేశ్, శశికిరణ్, రమేశ్, కుమ్మరిరాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

డీపీవోగా భాగం నిఖిలశ్రీ



డీపీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న భాగం నిఖిలశ్రీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ డీపీవోగా భాగం నిఖిలశ్రీ గురువారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు డీపీవోగా విధులు నిర్వర్తించిన పార్థసారథిని పంచాయతీ రాజ్ కమిషనరెట్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తన స్థానంలో గ్రూప్-1 పరీక్ష ద్వారా డీపీవోగా ఎంపికైన భాగం నిఖిలశ్రీకి ఆయన బాధ్యతలను అప్పగించి కమిషనరేట్‌లో రిపోర్ట్ చేశారు. ఖమ్మం జిల్లాలోని మధిరకు చెందిన నిఖిలశ్రీ అంతకుముందు తెలుగు విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు.

గ్రూప్-1కు ఎంపికయ్యాక మొదటిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలను స్వీకరించారు. ఆమెకు డీపీవో ఏవో అనంతరావు స్వాగతం పలికారు. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అక్రమ డిప్యుటేషన్ల రద్దుకు ఉద్యమ కార్యాచరణ

- సిద్ధం అవుతున్న ఉపాధ్యాయ సంఘాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఉపాధ్యాయవర్గాల్లో కలకలం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమ డిప్యుటేషన్ల రద్దు కోసం ఉద్యమ కార్యాచరణకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధం అవుతున్నాయి. 'అంతా మా ఇష్టం' శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపింది. పాఠశాల విద్యాశాఖ ఆదేశాలను పట్టించుకోకుండా, బీఎడ్, డైట్ కళాశాలల్లో గత మంగళవారం ఐదుగురు టీచర్లకు అక్రమంగా డిప్యుటేషన్లు ఇచ్చారు. దీనిని యూటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వీటిని రద్దు చేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. మెడికల్ గ్రౌండ్ కింద తప్పుడు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులు డీఈవో ఉత్తర్వుల మేరకు గురువారం ఆయా పాఠశాలల్లో చేరారు. ఈ అంశంపై కలెక్టర్‌ను, పాఠశాల విద్యాశాఖ డైరక్టర్‌ను కలువనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి తెలిపారు. ఇదిలా ఉండగా, డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఉపాధ్యాయురాలు మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ ప్రాథమిక పాఠశాలలో చేరినట్లు మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. బోయపల్లి పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడికి బీఈడీ కళాశాలకు డిప్యుటేషన్ ఇవ్వడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసేంత వరకు ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

'ఓపెన్' ఫలితాల విడుదల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సార్వత్రిక పీఠం ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలను మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్ కుమార్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య వివరించారు. జిల్లాలో 10వ తరగతిలో 57.26, ఇంటర్మీడియట్‌లో 54.50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 10వ తరగతిలో 74.77, ఇంటర్మీడియట్‌లో 65.66 శాతం విద్యార్థులు పాస్ అయ్యారు. వనపర్తి జిల్లాలో 10వ తరగతిలో 89.47, ఇంటర్మీడియట్‌లో 71.88 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 10వ తరగతిలో 75.26, ఇంటర్మీడియట్‌లో 66.91 శాతం, నారాయణపేటలో 10వ తరగతిలో 81.25, ఇంటర్మీడియట్‌లో 63.22 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జవాబు పత్రాల పునర్మూల్యాంకనం, పునఃపరిశీలనలకు అభ్యర్థులు నవంబరు 4 నుంచి 11 వరకు ఆన్‌లైన్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు.

అటకెక్కిన శేషాద్రి పవర్‌ప్లాంట్

- ఇప్పటివరకు ప్రారంభం కాని పరిశ్రమ నిర్మాణం
- భూములు ఇచ్చిన రైతులకు రాని ఉద్యోగాలు
- కోట్ల రూపాయలు పలుకుతున్న భూముల ధరలు
- సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రైతులు



పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృష్ణా మండలంలో రైతుల నుంచి సేకరించిన భూములు

మక్తల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శేషాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు అటకెక్కింది. భూములు ఇస్తే పరిశ్రమలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన యాజమాన్యం మాట తప్పింది. ఇప్పటివరకు పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదు. నారాయణపేట జిల్లా, ఉమ్మడి మాగనూరు మండలంలో 1983-84లో శేషాద్రి థర్మల్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున పరిశ్రమ ఏర్పాటు చేస్తామని యాజమాన్యం ప్రకటించింది. హిందుపూర్, తంగిడి, గురజాల, అడవి ఖానాపూర్ గ్రామాల రైతుల నుంచి ఎకరానికి రూ.6,500 చొప్పున భూమి కొనుగోలు చేసింది. భూములిచ్చిన ప్రతీ రైతుకు పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అందుకోసం 1984లో 350 ఎకరాలు, 2010లో మరో 150 ఎకరాలు కొనుగోలు చేసింది. అదే సమయంలో మరో వంద ఎకరాల భూమిని సేకరించినా, అది కంపెనీ పేరిట మార్పిడి కాలేదు. కానీ ఇప్పటివరకు అటు పవర్ ప్లాంట్‌ను నిర్మించలేదు. ఇటు ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఇచ్చినది నాణ్యమైన నల్లరేగడి భూములు కావడంతో, ఏ పంట వేసినా మంచి దిగుబడి వచ్చేదని వారు వాపోతున్నారు. ఇప్పటివరకు పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనందున తమ భూములు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని కోట్ల రూపాయల విలువైన భూములను కంపెనీకి ఇస్తే, నమ్మించి మోసం చేశారని ఆరోపిస్తున్నారు. వెంటనే పరిశ్రమను ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని, లేకపోతే తమకు భూములు తిరిగి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం



ఉద్యోగం వస్తుందనే ఆశతో శేషాద్రీ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి 16 ఎకరాల భూమిని తక్కువ ధరకు విక్రయించాను. కానీ ఆ కంపెనీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఉన్న భూమిని కోల్పోయిన నేను, కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ప్రభుత్వం సమస్యను గుర్తించి న్యాయం చేయాలి.

- సిద్ధప్ప, రైతు హిందుపూర్.

సారవంతమైన భూములు ఇచ్చాం



ఉద్యోగం వస్తుందనే ఆశతో శేషాద్రి పవర్ ప్లాంట్‌కు 4 ఎకరాల భూమిని విక్రయించాం. విలువైన భూములు కోల్పోయి నిరాశ్రయులమయ్యాం. భూములు సేకరించిన కంపెనీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. పవర్‌ప్లాంట్ నిర్మించలేదు కాబట్టి, సారవంతమైన మా భూములను తిరిగి మాకు ఇప్పించాలి.

- జవహర్‌లాల్ కృష్ణ, హిందుపూర్

కాటన్ మిల్లు వద్ద పత్తి రైతుల ఆందోళన

- రెండు కిలో మీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- రెండు గంటల పాటు రాస్తారోకో
- కలెక్టర్ రావాలని పట్టుబట్టిన రైతులు

కందనూలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి వద్ద గల కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లపై కొర్రీలు పెడుతున్నారని పత్తి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాస్తారోకోకు దిగారు. గురువారం రాత్రి వరకు రైతులు విక్రయించడానికి వచ్చిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయకుండా పత్తి తడిసిందని చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారులు తెచ్చిన పత్తి వాహనాలను తేమ శాతాన్ని చూడకుండా కొనుగోలు చేస్తున్నారని, రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ రావాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకోతో గగ్గలపల్లి గ్రామంలోని కాటన్ మిల్లు ఇరువైపులా వాహనాలు బారులు తీరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాగర్‌కర్నూల్ చెరువు అలుగు పారుతుండడంతో గగ్గలపల్లి గ్రామం మీదుగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ తదితర ప్రాంతాల ప్రయాణికులు వెళ్లాల్సి ఉంది.. ఆ దారే శరణ్యం కావడంతో వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి. రైతులు తెచ్చిన పత్తిని అధికారులు కొర్రీలు పెట్టకుండా నాణ్యతను పరిశీలించి నిజాయితీగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించిన కాటన్ మిల్లు నిర్వాహకులు మార్కెటింగ్ సిబ్బందితో రైతులు వాగ్వాదానికి దిగారు.

పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేయాలి



యజమానితో మాట్లాడుతున్న రైతులు

మక్తల్‌రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేపట్టాలని కోరుతూ గుడిగండ్లలోని లక్ష్మీదుర్గ ఆంజనేయ కాటన్ మిల్లు వద్ద గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ఆన్‌లైన్‌లో చేసుకున్న వివరాలు కనిపించడం లేదని యజమానులు పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. తిరిగి పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తిరుపతయ్య, పూజారి కురుమయ్య, రాజు, గణేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా, శిశుసంక్షేమ శాఖకు చెందిన సీడీపీవోలతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీలలో మంచి పౌష్టిక ఆహారం, ఇంగ్లీ టాకింగ్ బుక్, బొమ్మల ద్వారా ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలలో రిజిస్టర్ కానీ పిల్లల సంఖ్యను పెంచాలని అన్నారు. స్టేట్‌హోమ్‌లను చిల్డ్రన్ హోంలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. పోక్సో బాధితులకు అందుతున్న సహాయం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, డీఆర్‌డీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి సిద్ధపడ్డ వారిపై కేసు నమోదు

వీపనగండ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహానికి సిద్ధపడ్డ ఇరువురి కుటుంబాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి తెలిపారు. సంగినేనిపల్లి గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికను నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం చిన్నమ్మపల్లి గ్రామానికి చెందిన అబ్బాయితో పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాల వారు నిర్ణయించారు. గత జూన్ 5న నిశ్చితార్థం చేసుకున్నారు. ఆనాటి నుంచి బాలిక పాఠశాలకు వెళ్లకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరా తీసి విషయం తెలుసుకొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులతో పాటు పెళ్లికి సిద్ధమైన అబ్బాయి వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు బాలిక తరలింపు

కృష్ణ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాలికకు వివాహం చేసేందుకు పెద్దలు సిద్ధం అవుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు స్పందించారు. బాలికను చైల్డ్‌వెల్ఫేర్ సెంటర్‌కు తరలించారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని ఓ గ్రామంలో జరిగింది. బాలల సంరక్షణ అధికారి విద్యారాణి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న బాలికకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో శుక్రవారం పెళ్లి చేసేందుకు ఇరు కుటుంబాల సభ్యులు నిర్ణయించారు. ఈ విషయంపై గుర్తు తెలియని వ్యక్తి బాలల రక్షణ కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో బాలల రక్షణ అధికారులు, కాల్వల బాలరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మక్క, పోలీస్ సహకారంతో గురువారం బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల ప్రకారం బాల సదనంలో తరలించినట్లు వారన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం, కేసు నమోదు

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మండలంలోని సుల్తానపూర్ గ్రామానికి చెందిన కటారి రమేష్ అనే వ్యక్తి ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో, టోల్‌ప్లాజా సమీపంలోని తన కూల్‌డ్రింక్ షాపులో బుధవారం రాత్రి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడులు చేశారు. మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తెలకపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి గ్రామస్థుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలం మల్కాపూర్ చెందిన నాగయ్య తమ సొంత ఊరు నుంచి బైక్‌పై తెలకపల్లికి వస్తున్నాడు. రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుకు ఢీకొనగా, తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు 108 ద్వారా నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

మహబూబ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కీచక ఉపాధ్యాయుల తీరు మారడం లేదు. జిల్లాలో ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులపై పోక్సో కేసులు నమోదైన ఘటనలు వెలుగుచూడగా తాజాగా మరొకరిపై కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెరుమాళ్ల కృష్ణస్వామి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసక్తికరంగా 'ఓపెన్ హౌస్'

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రారంభించారు. పోలీస్ శాఖలోని బాంబ్ డిటెక్షన్, షీటీమ్స్, సైబర్‌క్రైమ్, డాగ్ స్క్వాడ్ తదితర విభాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల డ్యూటీలు, పని తీరును వారికి వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ కనకయ్య, సీసీఎస్ సీఐ శంకర్, ఆర్ఐ జగన్, ఎస్ఐ గోవర్ధన్, ఆర్ఎస్ఐలు గౌస్‌పాషా, ప్రశాంత్, శివాజీ తో పాటు వివిధ విభాగాలకు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ నాయకుడు విజయ్ కన్నా

వనపర్తి విద్యా విభాగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జాతీయ నాయకుడు విజయ్ కన్నా పిలుపునిచ్చారు. ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా గురువారం వనపర్తిలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ప్రతినిధుల సభలో విద్యారంగం ప్రస్తుత పరిస్థితులు అనే అంశంపై ఆయన సందేశం అందించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో మతపరమైన అంశాలను మూఢవిశ్వాసాలను చేర్చుతూ నూతన విద్యా విధానం పేరిట విద్యా రంగాన్ని కాషాయీకరణ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే యూనివర్సిటీలలో అనేక నిబంధనలను సడలిస్తూ స్వయం ప్రతిపత్తి కలిగిన యూనివర్సిటీలను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారని, జ్యోతిష్యంలో డిగ్రీ పట్టా ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్, పవన్, రంజిత్, సహాయ కార్యదర్శి గణేష్, రాష్ట్ర నాయకులు గణేష్, సైదులు, వంశీ, వంశీకృష్ణ, అర్జున్ పాల్గొన్నారు.

బోర్లు వేశారు... మోటార్లు మరిచారు

(5వ పేజీ తరువాయి)

ఉంది. అలాగే సదరు గిరిజన రైతుకు సంబంధించిన భూమిలో బండరాళ్లను తొలగించడం, జంగల్ కటింగ్ చేసి చదును చేయడం తదితర పనులను చేపట్టాల్సి ఉంది. కానీ ఈ పనులు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. మొత్తం 1,057 బోర్లకు గాను కేవలం 489 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మోటార్లను కూడా అన్ని బోర్లలో దించలేదు. కేవలం 268 బోర్లలో మాత్రమే మోటార్లను దించారు. మిగతా వాటిని వదిలేశారు. దీంతో బోర్లు వేసుకున్న రైతులు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

సౌర గిరిజల వికాసం అంతంతే..

రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడంతో పాత పథకమైన సీఎం గిరి వికాసం అటకెక్కింది. అయితే ఆ స్థానంలో మరింత మందికి లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచే చేపట్టింది. నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మాచారంలో సీఎం రేవంత్‌రెడ్డి మే 18న 2.10 లక్షల మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో చేపట్టిన 'ఇందిరా సౌర గిరి జల వికాసం'ను రూ.12,600 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. ఒక్కో యూనిట్ కోసం రూ. 6 లక్షలు కేటాయించారు. మాచారం గ్రామంలో 55 చెంచు కుటుంబాలు ఉండగా, మొదటి విడతగా అందులో 26 కుటుంబాలను ఎంపిక చేసి, 16 బోర్లు వేయించారు. సోలార్ మోటార్లు బిగించి పండ్ల మొక్కలు నాటారు. ఈ జిల్లా పరిధిలో 88 చెంచు పెంటలు ఉన్నప్పటికీ సీఎం ప్రారంభ కార్యక్రమం వరకే పథకం పరిమితమైంది. తర్వాత ఎవరూ దాని ఊసు ఎత్తలేదు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వంలో చేపట్టిన సీఎం గిరి వికాసంలో బోర్లు వేసుకున్న రైతులకు అటు ఆ పథకం ద్వారా లబ్ధి చేకూరకపోగా, ప్రస్తుతం ఇందిర సౌర గిరి జల వికాసం కింద కూడా తీసుకోవడం లేదని తెలుస్తోంది. అటు పాత పథకం అమలు చేయక, ఇటు కొత్త పథకం అమలులో వేగం పెంచకపోవడంతో గిరిజన రైతులు ఇబ్బంది పడుతున్నారు.

బీచుపల్లిలో ఎంపీ డీకే అరుణ పూజలు



బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

ఎర్రవల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయాన్ని గురువారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామన్‌గౌడ్ ఉన్నారు.

గద్వాల కోర్టుకు హాజరైన డీకే అరుణ

గద్వాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ గురువారం గద్వాల జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరయ్యారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన ధరూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎన్నికల్లో కేటీదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన స్థానిక నాయకుడు కుర్వ కరెప్ప తల్లి మహదేవమ్మ (ప్రస్తుత ధరూర్ పీఏసీఎస్ చైర్మన్)ను బీజేపీ రంగంలోకి దింపింది. ఆ సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టారన్న ఆరోపణలతో కేటీదొడ్డి పోలీసులు అరుణతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. గురువారం న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ నిర్వహించిన ఎగ్జామినేషన్ ప్రక్రియలో అరుణ పాల్గొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నానని తెలియజేశారు.

చేపల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఊర్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవల్లి (తిమ్మన్నపల్లి) శివారు చెరువులో చేపల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని తిమ్మన్నపల్లి మత్స్యకారుల సంఘం ప్రతినిధులు జగదీశ్, రాజు, శివకుమార్, మహేష్, ఆంజనేయులు, వెంకటయ్యలు డిమాండ్ చేశారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారికి అనుకొని రేవల్లి శివారులోని చెరువు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కెమికల్స్ వేయడంతోనే చేపలు మృతి చెందాయన్నారు. అక్కడ ఉన్న చిన్నపాటి చెట్లు, పొదలు కాలిబూడిదయ్యాయని అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీటితో పాటు కెమికల్స్ చెరువులో కలువడంతో అందులో ఉన్న చేపలు మృతి చెందాయన్నారు. చేపలు మృతి చెందడంతో జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు మరికొందరు తెలిపిన వివరాల ప్రకారం.. కెమికల్స్‌ను వాహనాల్లో తీసుకువచ్చి కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి పక్కన వేసి వెళుతున్నారు. గతంలో మండల కేంద్రంలోని గుజ్జరి యాదగిరి వ్యవసాయ పొలంలో వేయడం వల్ల 200 గజాల మడిలో వరి చేను కాలి బూడిదైంది, నిత్యం ఎక్కడో ఓ చోట కెమికల్స్ పారబోయడం అలవాటుగా చేసుకున్న వారిని గుర్తించాలని మండల వాసులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

కృష్ణానదిలో దూకి యువకుడి గల్లంతు

» గాలింపు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం



కృష్ణానది ఒడ్డున గాలింపునకు సిద్ధమైన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, పోలీసులు

ఎర్రవల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి కృష్ణానదిలో యువకుడు దూకి గల్లంతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ రవి కథనం ప్రకారం... వనపర్తి జిల్లా కాశీంనగర్ గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటేష్(35) తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బీచుపల్లి కృష్ణానదికి చేరుకున్నాడు. తాను నదిలో దూకి చనిపోతున్నట్లు సెల్ఫీ వీడియో తీసి బంధువులకు చేరవేశారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వనపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారి సమాచారం మేరకు ఇటిక్యాల పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

కర్ణాకర్ మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగనూలు అలుగులో గల్లంతైన కరుణాకర్(41)మృతదేహం నీటిలో తేలినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. లింగాల మండలం అంబటిపల్లికి చెందిన పోషకాని కరుణాకర్ జీవనోపాధి కోసం నాగర్‌కర్నూల్ వచ్చి శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం నాగనూల్ వెళ్లొస్తానని భార్యకు చెప్పి స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అలుగు దాటుతుండగా నీటిలో ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోయారు. శ్రీనివాస్ చెట్ల సహాయంతో బయటకు రాగా కరుణాకర్ నీటిలో గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికులు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం శవం నీటిలో తేలడంతో భార్య జ్యోతి తన భర్తగా గుర్తించింది. ఈ సంఘటనపై జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

చెరువులో పడి వివాహిత..



చిట్టెమ్మ (ఫైల్)

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పరమేశ్వర స్వామి చెరువులో పడి వివాహిత చిట్టెమ్మ (45) ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన ఆత్మకూరు పట్టణం సంజీవ్ నగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల మేరకు.. చిట్టెమ్మ, లక్ష్మన్న దంపతులు. వీరికి 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా, వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిట్టెమ్మకు గత కొంతకాలం నుంచి నరాల బలహీనత కారణంగా ఇంటిపట్టునే ఉండేది. ఈ నెల 29న రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి పరమేశ్వర స్వామి చెరువులో పడినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురువారం ఉదయం ఆమె కూతురు చూడగా ఇంట్లో లేదని తెలిపిందన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా దొరకలేదని, చెరువు కట్టపై వెళుతున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా చిట్టెమ్మ మృతదేహం కనిపించిందన్నారు. మృతురాలి అక్క సద్దలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



లక్ష్మి(ఫైల్)

మిడ్జిల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామ స్టేజి వద్ద బైక్‌పైనుంచి కిందపడి వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వేముల గ్రామ పంచాయతీ తమ్మడకుంటతండాకు చెందిన అమ్రియ భార్య లక్ష్మీ(55) మిడ్జిల్ గ్రామంలో జరిగే సంతకు వచ్చి తిరుగుప్రయాణంలో తండా చెందిన రాజు బైక్‌పై ఇంటికి వెళుతోంది. అకస్మాత్తుగా కుక్కలు అడ్డురావడంతో లక్ష్మమ్మ కిందపడి గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

నవాబ్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పొలం వద్దకు వెళుతున్న ఓ రైతును రాంగ్‌రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ విక్రమ్ గురువారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన మురుగని రాంచంద్రయ్య(50) ఈనెల 25న మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళుతుండగా ఎదురుగా తీగలపల్లి గ్రామానికి చెందిన చాకలి శివ తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి భార్య మాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భార్యపై భర్త దాడి, కేసు నమోదు

నవాబ్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం నిత్యం వేధింపులకు పాల్పడుతూ దాడి చేసిన భర్తపై చర్యలు తీసుకోవాలని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన దండు మానస అదే గ్రామానికి చెందిన హన్మంతును నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. అయితే నిత్యం భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తూ దాడి చేస్తుండటంతో విసిగిపోయిన భార్య పోలీసులను ఆశ్రయించింది. దీంతో గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

బిజినేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భార్య జహీదాబేగంను కత్తితో పొడిచి దారుణంగా హతమార్చిన కేసులో భర్త అబ్దుల్ నబికి యావజ్జీవ కారాగారంతో పాటు అదనపు కట్నం వేధింపులకు గాను మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ కే.శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌ఐ గురువారం తెలిపిన వివరాల మేరకు... బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఉమర్ తన కూతురు జహీదాబేగంను రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన నిందితుడు అబ్దుల్ నబికి ఇచ్చి 9 సంవత్సరాల క్రితం వివాహం చేశాడు. అదనపు కట్నం వేధిస్తుండగా 2022లో మృతురాలు జహీదాబేగం భర్త అబ్దుల్ నబి వేధింపులు తాళలేక పుట్టింటికి నలుగురు పిల్లలతో వచ్చి ఉన్నది. భార్యతో ఇప్పటి నుంచి సఖ్యతగా ఉండి జీవనం సాగిస్తానని నమ్మబలికాడు. 15 రోజుల తర్వాత రాత్రి సమయంలో అందరూ నిద్రిస్తుండగా కత్తితో విచక్షణ రహితంగా పొడిచి భార్యను హతమార్చాడు. కోర్టులో క్రమం తప్పకుండా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టి కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ చిన్నానాయక్, కానిస్టేబుల్ రమేష్‌లను ఎస్‌ఐ కే.శ్రీనివాస్ అభినందించాడు.

కారు, బొలెరో ఢీ: పలువురికి గాయాలు

మహమ్మదాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కారు-బొలెరో ట్రాలీ ఎదురెదురుగా ఢీ కొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన గురువారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం నంచర్ల గేట్ జాతీయరహదారిపై చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయి నుంచి కర్నూల్ షోరూంకు వెళుతున్న బొలెరో ట్రాలీని మహబూబ్‌నగర్ నుంచి కోస్గి వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో విష్ణు, మల్లేష్, శేఖర్‌లకు గాయాలయ్యాయి. బొలెరోలో ప్రయాణిస్తున్న రోషన్ తలకు, చేతులకు బలమైన గాయాలయ్యాయి.

రండి.. సాంస్కృతిక పోటీల్లో పాల్గొందాం

» ఐదు అంశాల్లో పోటీలు
» వచ్చే నెల11లోగా దరఖాస్తు చేసుకోవాలి



జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో నృత్యం చేస్తున్న మహిళలు(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తోంది. యువతలో సాంస్కృతిక సృజన వెలికితీసేందుకు ఈ పోటీలు వేదిక కానుంది. ఆసక్తిగల యువతీ, యువకులు ఈ పోటీలలో పాల్గొని నైపుణ్యాన్ని చాటవచ్చు. ఇందుకు సంబంధించి జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు.

పోటీల్లో పాల్గొనేందుకు అర్హతలు...

జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మహబూబ్‌నగర్ జిల్లా స్థానికులై ఉండాలి. పోటీలు జరిగే తేదీ నాటికి 15-29 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

- గత మూడు సంవత్సరాలలో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ యువజనోత్సవాలలో పాల్గొన్న వారు, గ్రూపులు ప్రస్తుత పోటీల్లో పాల్గొనేందకు అవకాశం లేదు.
- జానపద నృత్య గ్రూపు విభాగంలో 10 మంది కంటే ఎక్కువ ఉండొద్దు. సోలో విభాగంలో అయితే అయిదుగురికి మించొద్దు.
- రికార్డు చేసిన క్యాసెట్లు, పెన్‌డ్రైవ్‌లు అనుమంతిచరు. లైవ్‌గా ప్రదర్శించాల్సి ఉంటుంది. గ్రూపు విభాగానికి ఏడు నిమిషాలు మాత్రమే అనుమతి ఉంటుంది.

ఐదు అంశాల్లో పోటీలు...

జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో ఐదు అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ప్రతీ అంశంలో మొదటి స్థానంలో నిలిచిన వారిని హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు.

1) జానపద నృత్యాలు
2) జానపద నృత్యం గేయాలు
3) కవిత రచన
4) పెయింటింగ్
5) వృక్తృత్య పోటీలు

- పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రిని వారే స్వయంగా తెచ్చుకోవాల్సి ఉంటుంది.

రవాణా ఖర్చులు సైతం వారే స్వయంగా భరించాల్సి ఉం టుంది.

దరఖాస్తు చేసుకోవాలి

యువజనోత్సవాల పోటీల్లో పాల్గొనే వారు నిర్ణీత దరఖాస్తులను నవంబరు 11వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లా స్టేడియంలో గల క్రీడా శాఖ కార్యాలయంలో అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలి.

సద్వినియోతం చేసుకోవాలి



సాంస్కృతిక పోటీల్లో ఆసక్తి గల యువతి, యువకులకు మంచి అవకాశం. యువజనోత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనబరచవచ్చు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తాం. వచ్చే నెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలి.

- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో

వాగులో కొట్టుకుపోయిన బొలెరో

» ఒడ్డుకు చేర్చిన గ్రామస్థులు



బావాయిపల్లి వాగులో కొట్టుకుపోతున్న బొలెరో వాహనాన్ని ఒడ్డుకు లాగుతున్న ఎక్స్‌కవేటర్

కోడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని బావాయిపల్లి వాగులో చిక్కుకున్న బొలెరో వాహనాన్ని గ్రామస్థులు జేసీబీ సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రవాణా సౌకర్యం స్తంభించింది. మండల పరిధిలోని బావాయిపల్లి, పసుపుల, ఖానాపూర్ తదితర వాగులు పొంగి పొర్లడంతో రవాణా పూర్తిగా నిలిచిపోయి జన జీవనం స్తంభించింది. మండలంలోని పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు కట్టపై సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో మట్టి రోడ్డు పూర్తిగా అడుగు లోతు గుంతలు పడి వాహనదారులకు పెద్ద వాహనాలకు వెళ్లడానికి రాక రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగులపై బ్రిడ్జిల నిర్మాణం పాలమూ రు-రంగారెడ్డి తీగలపల్లి శివారులో క ట్టపై బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయా లని కోరుతున్నారు.

వరదలో చిక్కుకున్న వారికి సహాయం

ఉప్పునుంతల, (ఆంధ్రజ్యోతి): ఉప్పునుంతల మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామానికి చెందిన కడారి గణేష్, సువర్ణ దంపతులు డిండి అలుగు అవతల వైపు గొర్రెల మంద ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటున్నారు. మంగళవారం గొర్రెలను మేపి అక్కడే ఉన్నారు. బుధవారం ఎడతెరిపిలేని వర్షంతో డిండి నిం డి ప్రాజెక్టు అలుగుగుండా ప్ర వేశించడంతో గ్రామానికి రాలేకపోయారు. వారికి భోజనం లేక పస్తులున్నారు.



తాళ్ల సహా... వస్తున్న గొర్ల కాపరులు

విషయం తెలుసుకున్న అచ్చంపేట డీఎస్పీ పల్లే శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్‌ఐ వెంకట్ రెడ్డిలు అక్కడకు చేరుకొని తాళ్ల సహాయంతో వారిని సురక్షతంగా తీసుకొచ్చారు.

పశువుల మృతి

లింగాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూర్యానాయక్ తండాలో జరుపుల రాజ్యకు చెందిన రెండు ఎద్దులు, జరుపుల లక్ష్మణ్‌కు చెందిన రెండు ఎద్దులు చంద్రసాగర్ వాగులో కొట్టుకపోయి మృత్యువాత పడ్డాయి. సుమారు 3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అదే విధంగా రాయిచేడు గ్రామ వాసి గొడుగు వీరయ్యకు చెందిన 8 గేదెలు, 4 దూడలతో గడ్డి తదితర పరికరాలు చంద్రసాగర్ వాగులో కొట్టుకపోయి మృతి చెందాయి. సుమారు 10 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. పశువుల కళేబరాలు కనిపించాయి. గురువారం చంద్రసాగర్‌లో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలిస్తున్నారు.

కూలిన మట్టిమిద్దె.. తప్పిన ప్రమాదం

గండీడ్,(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం కారణంగా మట్టిమిద్దె కూలింది. ఈ ఘటన గండీడ్ మండలం వెన్నచేడులో చోటు చేసుకుంది. వర్షాల కారణంగా గ్రామానికి చెందిన పిట్ల భీమమ్మకు చెందిన మట్టి మిద్దె బుధవారం రాత్రి కూలింది. ఆ సమయంలో ఆమె తనకూతురు దగ్గరకు వెళ్లడంతో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు. తనకున్న గూడు కోల్పోవడంతో నిరాశ్రయురాలునైనానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

పురుగుల మందు తాగి నవ వధువు ఆత్మహత్య



గొల్ల శ్రీలత(ఫైల్)

కోస్గి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన మూడు రోజులకే ఓ నవ వధువు ఆత్మహత్య చేసుకొంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన గొల్ల శ్రీలతకు ఫారూఖ్‌నగర్ మండలం భీమవరం గ్రామానికి చెందిన వ్యక్తితో పెళ్లి జరిగింది. నవ దంపతులు వికారాబాద్ జిల్లా దోమ మండలం మోత్కూరులో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చారు. ఈ నెల 28న పురుగుల మందు తాగడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం అందించారు. చికిత్స పొందుతూ ఈ నెల 29న గొల్ల శ్రీలత(21) మరణించింది. కాగా చంద్రవంచకు చెందిన ఓ యువకుని వేధింపులకే తమ చెల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరులు గొల్ల మహేష్, గొల్ల శ్రీశైలం ఆరోపిస్తున్నా రు. బలవంతపు పెళ్లి చేయడంతోనే మరణించినట్లు మరికొందరు అంటున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కోస్గి శివారు చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వచ్చి వారిని సద్దుమణిగించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

» గోవింద నామస్మరణంతో మోరుమోగిన గిరులు



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శనం కోసం వస్తున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి, కురు మూర్తి వాసా గోవిందా.. గోవిందా.. అంటూ అత్యంత భక్తితో దాసంగాలు, నైవేద్యా లను సమర్పిస్తున్నారు. అలాగే జాతరలో వెలసిన వివిధ స్టాల్స్‌ల, వద్ద దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి నెలకొన్నది. మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల రంగులరాట్నాల వద్ద చిన్నారులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఉంటున్నారు. గురువారం జాతరలో వర్ష ప్రభావం లేకపోవడంతో భక్తులు కొంత వరకు ఉపశమనంతో ఊపిరి పీల్చుకున్నారు.



జాతరలో వెలసిన కుంకుమ దుకాణం

స్పెషల్ బ్రాంచ్ సీఐ, ఎస్‌ఐల బదిలీ

» బదిలీ అధికారులను సత్కరించిన ఎస్పీ



స్పెషల్ బ్రాంచ్ సీఐని సత్కరిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ స్పెషల్ బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలకు బదిలీ జరిగింది. ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేష్ హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ కేటీదొడ్డి ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ స్థానంలో 2004 బ్యాచ్‌కు చెందిన బాలరాజు నియమితులు కాగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 2005 నుంచి 2013 వరకు హైదరాబాద్ టాస్క్‌ఫోర్సులో విధులు నిర్వర్తించారు. 2013-18 వరకు ఇంటెలిజెన్సీలో పనిచేసిన ఆయన 2017-19 కాలంలో జడ్చర్ల ఎస్‌హెచ్‌వోగా పనిచేశారు. కాగా, బదిలీపై వెళుతున్న అధికారులను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు సత్కరించారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసి బదిలీపై వెళుతున్న అధికారుల సేవలు మరువలేనివని, ఎంతో నిబద్ధతతో పనిచేశారని వారి సేవలను ఎస్పీ కొనియాడారు. ఎక్కడ పనిచేసినా ఇదే నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. అడిషినల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, ఎస్పీ సీసీ రాంరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు గాంధీనాయక్, అప్పయ్య, ఇజాజుద్దీన్, కమలాకర్, రామకృష్ణ, శ్రీనివాస్, భగవంత్‌రెడ్డి, బాలరాజు, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేశ్‌లు పాల్గొన్నారు.

వచ్చే నెల 4న ఉమ్మడి జిల్లా కరాటే జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 4న ఉమ్మడి జిల్లా అండర్-14,17 బాల, బాలికల కరాటే జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో 01-01-2012, అండర్-17లో 01-01-2009 తరువాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్, నాలుగు ఎలిజిబిలిటి పత్రాలతో ఉదయం 9 గంటలకు జిల్లా ప్రధాన స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

3న ఉమ్మడి జిల్లా అండర్-17 రగ్బీ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 3న ఉమ్మడి జిల్లా అండర్-17 బాల,బాలికల రగ్బీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. బోనఫైడ్, ఆధార్, నాలుగు ఎలిజిబిలిటి పత్రాలతో ఉదయం 9 గంటలకు జిల్లా ప్రధాన స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

పసుపుల వాగులో రిలే దీక్ష

» బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ నిరసన



వాగులో రిలే దీక్ష చేస్తున్న సామాజిక నాయకుడు ఆకునమోని చంద్రయ్య

పెంట్లవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో గురువారం ఉదయం సామాజిక ఉద్యమకారుడు ఆకునమోని చంద్రయ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు మధ్యలో కూర్చొని రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల వాగు ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో పొంగి పొర్లడంతో వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. అదే విధంగా వాగు అవతలో శ్మశాన వాటిక ఉండటంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని అంత్యక్రియలకు తీసుకు వెళ్లేందుకు పశువులు వాగు దాటితేనే దహన సంస్కారాలు చేసేందుకు వీలు ఉంటుందన్నారు.

గతంలో అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ.2 కోట్ల 60 లక్షలతో పశువుల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. కానీ ఇంత వరకు కూడా పనులు ప్రారంభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టేంత వరకు పోరాటం కొనసాగిస్తామని వారన్నారు. ఈ దీక్షకు గ్రామస్థులు సంఘీభావం తెలిపారు. గ్రామస్థులు ఘనమోని రాముడు, మాచర్ల రవి, ఆకునమోని రమేష్‌యాదవ్, అజయ్, ఉడుత నాగరాజు, గడ్డం కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి మళ్లీ ప్రత్యక్షం

నవాబ్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామ సమీపంలో ఉన్న దేవర గుట్టపై పెద్దపులి మరోసారి గురువారం సాయంత్రం గ్రామస్థులకు కనిపించింది. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం యన్మన్‌గండ్లలో పెద్దపులి సంచారం అని వార్త రావడంతో అటవీశాఖ అధికారి వెంకటేశ్ తన సిబ్బందితో కలిసి దేవర గుట్టను పరిశీలించారు. గుట్టలో పాదముద్రలు సేకరించిన అధికారులు పెద్దపులి కాదు చిరుత అని నిర్ధారించి వెళ్లిపోయారు. సాయంత్రం మరోమారు పెద్దపులి గుండుపైకి రావడాన్ని స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

మెడలో బంగారు గొలుసు చోరీ

వడ్డేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు గ్రామానికి చెందిన శారదమ్మ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి గురువారం బంగారు గొలుసు చోరీ చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో శారదమ్మ ఆరోగ్యాన్ని చూయించుకుని భార్యాభర్తలు అంబేడ్కర్ చౌరస్తా వద్ద సొంత గ్రామానికి వెళ్లేందుకు వేచి ఉన్నారు.

మద్దూరు గ్రామానికి వెళుతున్నానని గుర్తుతెలియని వ్యక్తి చెప్పడంతో మోటారుసైకిల్ ఎక్కి వెళ్లారు. మద్దూరు స్టేజి రాగానే మోటార్‌సైకిల్ ఆపి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. సుమారు ఒక తులం బంగారం గొలుసు ఉన్నదని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఫర్టిలైజర్ షాపులో నగదు చోరీ



ధ్వంసం చేసిన డబ్బుల కౌంటర్

పెబ్బేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మునిసిపాలిటీలోని ఎరువుల దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. అపోలో ఫార్మసీకి ఎదురుగా ఉన్న మహేష్ ట్రేడర్స్(ఎరువుల దుకాణం)లో గుర్తు తెలియని వ్యక్తులు షటర్ తాళాలు పగులగొట్టి ష్యాపు కౌంటర్‌లో ఉన్న దాదాపు రూ.5వేల చిల్లర నగదును అపహరించినట్లు తెలిపారు. షాపు యజమాని నీలం శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు రన్ ఫర్ యూనిటీ

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6:30 గంటలకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ డా.వినీత్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి రెండున్నర కిలోమీటర్ల రన్నింగ్ నిర్వహించనున్నామని, ప్రజలు, యువకులు, విద్యార్థులు పెద్ద మొత్తంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఉదయం 10 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని, ప్రజలు, యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్పీ కోరారు.

కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలి

నారాయణపేటరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని పత్తిని మిల్లులకు తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి దినకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పళ్ళ బుజుర్గ్ గ్రామ పత్తి రైతులకు టెక్నికల్ సమస్య ఉన్నందున స్లాట్ బుకింగ్ జరగలేదని, ఆ సమస్యను ప్రస్తుతం పరిష్కరించామన్నారు. రైతుల ఫోన్ నెంబర్లు సరిగ్గా నమోదు కాకపోతే రైతువేదికల్లో ఏఈవోల వద్ద అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

గుండుమాల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బలబద్రాయపల్లిలో ప్రతీ ఒక్కరు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డుపై బట్టలు ఉతకడం, అనవసరంగా రోడ్లపైకి నీళ్ల వదిలితే పంచాయతీ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకుడు గుంత నిర్మించుకుంటే గ్రామంలో ఈగలు, దోమల బాధలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

రేపు దళితుల ఆత్మగౌరవ మహార్యాలీ

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్ మీద దాడి జరిగి 20 రోజులు కావస్తున్నా నేటికీ నిందితులపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ నిర్వహించనున్నామని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.శివకుమార్‌మాదిగ తెలిపారు. గురువారం స్థానిక చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాలీకి సంబంధించి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి సెక్రటేరియట్ పక్కన గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందని, అనంతరం సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమితి జిల్లా ఇన్‌చార్జి మంద నరసింహామాదిగ, ప్రధాన కార్యదర్శి డి.రవి మాదిగ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

మక్తల్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున దోమల నుంచి వచ్చే డెంగీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్ని పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. మక్తల్ మండలంలోని ముసలాయిపల్లిలో కొందరికి డెంగీ జ్వరం రావడంతో జిల్లా వైద్య అధికారుల బృందం పర్యటించి, తగిన జాగ్రత్తలు వివరించారు. దోమల నివారణ కోసం మందులు పిచికారి చేయించారు. సిబ్బంది శంకర్, చంద్రశేఖర్, శ్రీధర్, ఏఎన్ఎం శివలీల, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఆలయ నిర్మాణ కమిటీ పోస్టర్లు విడుదల

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో హరేరామ హరేకృష్ణ దేవాలయ నిర్మాణానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు హరేరామ హరేకృష్ణ ఆలయ కమిటీ అధ్యక్షుడు అద్భుత్‌నర్సిందాస్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం నారాయణపేటలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ నివాసంలో ఆలయ నిర్మాణానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ, శ్రీనివాస్, చింత శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తే చర్యలు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న ఓ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లోని విద్యార్థినులకు షీ టీమ్ పోలీసులు గురువారం మహిళల భద్రత, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్లు 100, 1091, 181లపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే 8712670398 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నప్ప, ఇనిస్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఊట్కూర్‌లో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలి

● సామాజిక కార్యకర్త బి.మహేష్‌గౌడ్

ఊట్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ పరిధిలో ఉన్న ఊట్కూర్‌లో కూడా రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త బి.మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బిజ్వార్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిపిన సర్వేలో ఊట్కూర్ రైల్వేస్టేషన్ పేరు ఉండగా తాజా రైల్వే శాఖ డీపీఆర్‌లో ఊట్కూర్ పేరు లేకపోవడం విచారకరమని అన్నారు. ఎంపీ, మంత్రి చొరవ తీసుకుని ఊట్కూర్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటు జరిగేలా చూడాలని కోరారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

» కలెక్టర్ సిక్తా పట్నాయక్
» మద్దూర్ సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



మద్దూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ సిక్తా పట్నాయక్ హెచ్చరించారు. గురువారం ఆమె మద్దూర్‌లోని సీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలను ఆమె ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి ఓపీ, స్టాక్ రిజిస్టర్, వైద్య సిబ్బంది హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు సకాలంలో రావాలన్నారు. 30 ఏళ్ల పైబడిన వారందరికి స్కానింగ్ చేయాలన్నారు. మిగతా వారు కేవలం వైద్య సేవలు మాత్రమే చేయించుకున్నారని ఫార్మాసిస్టు అన్నారు. వైద్యాధికారి పావని, సిబ్బంది ఉన్నారు.

జడ్పీహెచ్ఎస్ పాఠశాల తనిఖీ

మద్దూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి బోధనా అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్ జరుగుతున్న పరీక్ష వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఫుడ్ సేఫ్టీ విద్యార్థులకు ముఖ్యమని వారికి భోజనం అందించకముందే కమిటీ టెస్ట్ చేయాలన్నారు. వెనుకబడిన సీ, డీ గ్రూప్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల అటెండెన్స్‌కు, జనరల్ రిజిస్టర్‌కు తేడా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేటట్లు చూడాలన్నారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. డీఈవో గోవిందరాజులు, సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, సీఎంవో రాజేందర్‌కుమార్, మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి యాదయ్య, ఎంఈవో బాలకిష్టప్ప, హెచ్ఎం సవిత తదితరులున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

» అవగాహన కార్యక్రమాల్లో అధికారులు



మాగనూరులోని పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరోజిని

మాగనూరు/కొత్తపల్లి/గుండుమాల్/ఊట్కూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సురేశ్ పేర్కొన్నారు. మాగనూరులోని పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే బాలికల ఎదుగుదల నిలిచిపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుదర్శన్‌గౌడ్, ఏఎస్ఐ మన్సూర్, సీడీపీవో సరోజిని, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు పాల్గొన్నారు.

అదేవిధంగా, కొత్తపల్లి తహసీల్‌లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై పూజారులకు, హజీలకు, ఫొటోగ్రాఫర్లు, టెంట్‌హౌస్, డీజే నిర్వాహకులకు తహసీల్దార్ జయరాములు అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ఉన్న బాలికలకు పెళ్లిళ్లు జరిగితే 1098 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీవో కృష్ణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమాల, ఎన్‌జీవో రవికుమార్, ఆర్ఐ శ్రావణ్‌కుమార్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గుండుమాల్ తహసీల్‌లో తహసీల్దార్ భాస్కరస్వామి అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే అంగన్‌వాడీ కార్యకర్త, పంచాయతీ కార్యదర్శులు వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊట్కూర్ పరిషత్ కార్యాలయంలో బాలల హక్కుల సంరక్షణపై నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడారు. పిల్లలపై లైంగిక దాడులు, బాల్య వివాహాలు, బాలకార్మికులుగా పని చేయించడం వంటివాటిని అరికట్టాలన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన పెంచడంతో పాటు వాటిని అరికట్టడానికి గ్రామ స్థాయి నుంచి పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తహసీల్దార్ చింతరవి, ఎస్ఐ రమేష్, ఐసీడీఎస్ సీడీపీవో జయ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కొండన్న, ఏవో గణేష్‌రెడ్డి, డీసీపీవో తిరుపతయ్య, ఎంపీవో మాధవి, మహిళ సంఘం అధ్యక్షురాలు శివలీల, సూపర్‌వైజర్ అరుణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూడైస్‌లో సమగ్రంగా వివరాలు నమోదు చేయాలి

మద్దూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యూడైస్‌లో సమగ్రంగా వివరాలను నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. గురువారం మద్దూర్‌లో నిర్వహించిన యూడైస్ శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. అలాగే ఏఎక్స్‌ఎల్, ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్ తదితర కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు సలహాలు చేశారు. సీఎంవో రాజేందర్, మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి యాదయ్య, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఎంఈవో బాలకిష్టప్ప, కాంప్లెక్స్ హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



నారాయణపేటలో బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాలల విద్యార్థులు


నారాయణపేట న్యూటౌన్/మాగనూరు/దామరగిద్ద, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు సంపూర్ణంగా బంద్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యుడు నరహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, ఇందుకు నిరసనగా కళాశాలల బంద్ నిర్వహించామన్నారు. తక్షణమే పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు నరేశ్, విష్ణు, కనకప్ప, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదేవిధంగా మాగనూరులో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు నయూమ్, అమ్రేష్, రమేష్, సూర్యప్రకాష్ తదితరులు బంద్‌లో పాల్గొన్నారు.

దామరగిద్దలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించి రెన్యూవల్‌కు అనుమతినివ్వాలి

» డీఐఈవోకు అతిథి అధ్యాపకుల వినతి



డీఐఈవోకు వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత డిసెంబరు నుంచి మార్చి వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి ఈ విద్యా సంవత్సరం రెన్యూవల్‌కు అనుమతినిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అతిథి అధ్యాపకులు గురువారం నారాయణపేట ఇంటర్ విద్యా కార్యాలయంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సుదర్శన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. పది నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని, తక్షణమే పెండింగ్ వేతనాలు అందేలా చూడాలన్నారు. కొత్తపల్లి జూనియర్ కాలేజీలో 9 మంది, గుండుమాల్‌లో ఏడుగురు అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారని, ఈ విద్యాసంవత్సరంలో అనుమతితో పాటు, వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు బృంద సంజీవ్, మల్లేష్, పవన్‌కుమార్, శ్రీకాంత్, శ్రీనాథ్, సంధ్యారాణి తదితరులున్నారు.

క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరులకు నివాళి



మరికల్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా మరికల్ పోలీస్ స్టేషన్ నుంచి మరికల్ చౌరస్తా వరకు పోలీసులు, యువత కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎస్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



పేట బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ నర్సయ్య

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట బాలికల ఉన్నత పాఠశాలను మునిసిపల్ కమిషనర్ నర్సయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆ తర్వాత రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కమిషనర్ భోజనం చేశారు. కమిషనర్ వెంట మేనేజర్ అజీమ్, పర్యావరణ ఇంజనీర్ భరత్ ఉన్నారు.

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల తనిఖీ

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఎం.ఏ.రషీద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో ఉపన్యాసకుల, విద్యార్థుల, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి బయోలాజీ, మ్యాథ్స్ క్లాసులను పర్యవేక్షించారు. అంతకుముందు వంట గది, స్టోర్ రూమ్, నిత్యావసర వస్తువులు పరిశీలించారు. బియ్యం బస్తాల్లోని బియ్యం చూసి రోజు శుభ్రం చేసి వండాలన్నారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో మంత్రి వాకిటి

మక్తల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో గురువారం మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి వివిధ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల మంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

గూడ్స్ రైలు ఢీకొని 16 గొర్రెలు మృతి

మక్తల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని 16 గొర్రెలు మృతి చెందిన సంఘటన మక్తల్ మండలం గుర్లపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుర్వ వెంకటప్ప గొర్రెలను రైలు పట్టాల సమీపంలో మేపుతుండగా రాయచూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గూడ్స్ రైలు గొర్రెలను ఢీకొట్టింది. ఘటనలో 16 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ రూ.1.60 లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు.

వృద్ధులు, చిన్నారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

» వృద్ధాశ్రమం, బాల సదనం తనిఖీలో న్యాయాధికారి వింధ్యానాయక్

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, చిన్నారుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యానాయక్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె స్థానిక బారంబావి వద్దనున్న వృద్ధాశ్రమం, బాలసదనం హోమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించి, వృద్ధుల, చిన్నారుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నివాస గదులు శుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు మందులు ఇస్తుండాలని, సొంతింటి వారి మాదిరిగా చూసుకోవాలని తెలిపారు. అనంతరం అరటిపండ్లు అందజేశారు. తనిఖీలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతిగౌడ్, పోలీసులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

» డీఎస్పీ నల్లపు లింగయ్య



దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

దామరగిద్ద, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం ఆయన దామరగిద్ద పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మండల పరిధిలో నేరాల నియంత్రణపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, పౌరుల పట్ల మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా త్వరగా పరిష్కారం చూపాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్స్‌పై నిఘా ఉంచాలని, వారి వివరాలు సేకరించి నిరంతరం తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ తమకు కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీ : ఎస్పీ వినీత్



నారాయణపేటలో సైకిల్ తొక్కుతున్న ఎస్పీ వినీత్, డీఎస్పీ లింగయ్య తదితరులు



మక్తల్‌లో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సైక్లింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు సైకిల్ తొక్కడం వల్ల శరీర దృఢత్వం పెరగడమే కాకుండా మనస్సుకు ఉత్తేజం లభిస్తుందని ఎస్పీ వినీత్ అన్నారు. పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో సైకిల్ ర్యాలీని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా పరేడ్ గ్రౌండ్ నుంచి సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొని పోలీసుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆరోగ్యంగా ఉంటే విధుల్లో మరింత సమర్థతతో రాణించవచ్చన్నారు. ఏఎస్పీ ఎండీ.రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు లింగయ్య, మహేష్, సీఐ శివశంకర్, ఆర్ఐ నర్సింహ, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్ శేత, శిరీష, కృష్ణచైతన్య, పీఈటీ రమణ, యోగా సభ్యులు పాల్గొన్నారు.

● మక్తల్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మక్తల్ సీఐ రాంలాల్ ఆధ్వర్యంలో పోలీసులు, పట్టణ ప్రజలతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీఐతో పాటు, సైక్లింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నల్లజానమ్మ ఆలయం వరకు కొనసాగింది. అమరవీరులకు జోహార్లు అంటూ పోలీసులు నినదించారు. కృష్ణ, మాగనూరు, ఊట్కూర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ



హెచ్ఎంలకు వంట సామగ్రి పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాగనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల వనరుల కేంద్రంలో గురువారం మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన వంట సామగ్రిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల నాయకుడు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

» ఎంపీడీవో కృష్ణారావు



తిమ్మారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొత్తపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు సూచనలు చేశారు. గ్రామంలో తొమ్మిది ఇండ్లు మంజూరు కాగా అందులో ఐదు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మిగతా లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో నిర్మించలేదని ఆయన తెలిపారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



క్యాతన్‌పల్లిలో గోమాతకు పూజలు చేస్తున్న బీకేఎస్ నాయకులు, రైతులు

దామరగిద్ద/నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో గోమాత విశిష్టతను తెలుపుతూ గోమాతకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరణయ్య స్వామి, నారాయణపేట పట్టణ అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప గోమాత విశిష్టతను వివరించారు. బస్వరాజు, గోపాలకృష్ణ, నర్సప్ప పాల్గొన్నారు. అలాగే, మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో బీకేఎస్ జిల్లా నాయకులు కావలి మొగులప్ప ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో శివరాంరెడ్డి, రవికుమార్, మహిళలు పాల్గొన్నారు.

అదేవిధంగా, పేట పట్టణంలోని సింగార్‌బేస్ ఆంజనేయస్వామి ఆలయంలో గోపాష్టమి సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు డా.కె.భీమయ్య గోవులకు పూజలు చేశారు. గోమాతలో సకల దేవతలు కొలువై ఉంటారని, గోమాతను పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆయన పేర్కొన్నారు. బీకేఎస్ ఉపాధ్యక్షుడు టి.ఈశ్వర్, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.